ప్రజాశక్తి

సోమవారం 10 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నేడు గోవాడ, తాడి, రేపు బల్క్‌డ్రగ్‌ ప్రభావిత ప్రాంతాల్లో..

సిపిఎం ప్రజా చైతన్యయాత్ర

◆ హాజరుకానున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ◆ ప్రజలతో ముఖాముఖి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ప్రభుత్వం, ఎంపీ, ఎమ్మెల్యేలు విస్మరించిన ప్రధాన ప్రజా సమస్యలపై సిపిఎం ప్రజా చైతన్య యాత్ర చేపడుతోంది. చెరుకు రైతులు, నిర్వాసితులు, కాలుష్య పరిశ్రమల ప్రభావిత ప్రజల బాధలు తెలుసుకొని ప్రజా పోరాటాలు నిర్మించేందుకు ఈ యాత్ర సాగనుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం గోవాడ సుగర్‌ ఫ్యాక్టరీ, సాయంత్రం పరవాడ ఫార్మాసిటీ కాలుష్యంతో బాధపడుతున్న తాడి ప్రాంతాల్లోనూ, మంగళవారం నక్కపల్లి బల్క్‌డ్రగ్‌ పార్కు భూ నిర్వాసిత గ్రామాల్లోనూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చైతన్యయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓసారి పరిశీలిస్తే..

చెరుకు రైతును ఆదుకోని ప్రభుత్వం

వ్యవసాయాధారిత అనకాపల్లి జిల్లాలో వరి తరువాత ప్రధాన సాగైన చెరుకు రైతును పాలక ప్రభుత్వాలు ఆదుకోలేదు సరికదా సాగుపట్ల ఆసక్తిలేకుండా చేశాయి. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార సుగర్‌ ఫ్యాక్టరీల క్రషింగ్‌ నిలిపివేయడమే కాదు, గోవాడ సుగర్‌ ఫ్యాక్టరీని దెబ్బతీసి మూసివేయాలని ప్రభుత్వం చూస్తోంది. గోవాడ సుగర్‌ను ఆధునికీకరించి క్రషింగ్‌ సామర్థ్యం పెంచకుండా దాని సామర్థ్యం తగ్గేలా చేస్తోంది. కనీస ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందించడంలేదు. రోజుకు 4 వేల టన్నుల చెరుకు క్రషింగ్‌ సామర్థ్యం కలిగిన ఈ ఫ్యాక్టరీ 1500 టన్నులకు మించి క్రషింగ్‌ చేయలేనప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదు. చెరుకు సరఫరా చేసిన రైతులకు బిల్లులు

చెల్లించలేని స్థితిలో ఫ్యాక్టరీ వుంది. గతేడాది బకాయిలు కొనసాగుతున్నాయి. అమ్మకపు అనుమతుల్లేక కోట్ల విలువైన పంచదార నిల్వలు న్నాయి. బాధలు భరించలేక చెరుకు రైతులు ఇటీవల రోడ్డెక్కారు. అయినా వారి సమస్యలు ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు పట్టడం లేదు.

తాడి మాటేంటి ?

దాదాపు రెండు దశాబ్దాలవుతున్నా పరవాడ మండలం తాడి తరలింపు సమస్య పరిష్కారం కాలేదు. కాలుష్య ఔషధ పరిశ్రమలకు చెంతనే ఉన్న తాడిని తరలించడానికి ఏ ప్రభుత్వమూ చొరవ చూపలేదు. 2,400 ఎకరాల్లో 2006లో జవహర్‌లాల్‌ నెహ్రూ ఫార్మాసిటీ ఏర్పడింది. ఫార్మాసిటీ డెవలపర్ మిగతా 2లో..

నర్సులను సత్కరిస్తున్న మంత్రి అనిత

నర్సుల సమస్యల పరిష్కారానికి కృషి

హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రా మెడికల్ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనిత నర్సులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఎప్పుడూ మహరాణులేనన్నారు. రోగులను నర్సులు ఎప్పుడు అమ్మలా చూసుకుంటారన్నారు. మహిళలు లేకపోతే పురుషులు లేరని తెలిపారు. మహిళ జీతం మిగతా 2లో..

వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం

▶ వార్త 8లో..

అభివృద్ధికి పెద్దపీట

▶ వార్త 2లో..

కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యత

▶ వార్త 5లో..

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

సమస్యలు పరిష్కరించకుంటే

సమ్మెకు సిద్ధం

◆ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి ఉక్కు కాంట్రాక్టు కార్మికుల హెచ్చరిక

◆ గాజువాకలో మహాధర్నా

ప్రజాశక్తి - గాజువాక : స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల అక్రమ తొలగింపులు ఆపకుంటే నిరవధిక సమ్మె తప్పదని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను ఎవ్వరినీ తొలగించరాదని. ఇప్పటి వరకూ తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, ఇఎస్ఐ లేని కార్మికులకు స్టీల్ యాజమాన్యమే వైద్య సౌకర్యం కల్పించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరుతూ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన పాత గాజువాక జంక్షన్‌లో ఆదివారం మహాధర్నా జరిగింది. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాసరావు దీనికి అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్‌లో విఆర్ఎస్ పేరుతో పర్మినెంట్ కార్మికులను, బలవంతంగా కాంటాక్ట్ కార్మికులను తొలగించడం దారుణమన్నారు. సమస్యలపై పోరాడుతున్న ఉక్కు నేత అయోధ్యరామ్‌కు ప్లాంట్ యాజమాన్యం షోకాజ్ నోటీసు ఇవ్వడం దారుణమన్నారు. దాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలన్నారు. బలమైన ఉద్యమాల వల్లే ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని తెలిపారు. పోరాటాలను బలహీనపరచాలని, ఉద్యమాన్ని నాశనం చేయాలని కేంద్రం చేయని కుట్ర లేదన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ త్యాగాలతో ఏర్పడ్డ ప్లాంట్‌ను అదే స్ఫూర్తితో కాపాడుకుంటామన్నారు. ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, కె.వంశీ, ఉరుకూటి అప్పారావు మాట్లాడుతూ. ఉక్కు ఉత్పత్తిలో 30 సంవత్సరాలుగా కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ఇచ్చింది కార్మికులను తొలగించడానికా ? అని ప్రశ్నించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు. జె.అయోధ్యరాం, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జి.గణపతిరెడ్డి, వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, సిపిఐ నాయకులు కె.సత్యనారాయణ, టిడిపి నాయకులు పులి రమణారెడ్డి, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, మిగతా 2లో..

నేటి నుంచి యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం నుంచి యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని వారాల నుంచి పిజిఆర్ఎస్ రద్దయిన సంగతి తెలిసిందే. కోడ్ ముగిసిన క్రమంలో కార్యక్రమాన్ని పున్ణప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల, జిల్లా స్థాయి అధికారులు సంబంధిత ఏర్పాట్లు చేసుకోవాలని, మిగతా 2లో..

అరుణాంజలి

అలుపెరగని యోధుడుగా
మీరు సాధించిన విజయాలు ఒక చరిత్ర...
మీరు వెలిగించిన చిరుదీపాలే
మాకు మార్గదర్శకాలు!
మీ రాజీలేని పోరాటాలు మాకు స్ఫూర్తి...
మీ ఆశయసాధనకై
ముందుకు సాగుతాం...
మీకు ఇవియే మా ఉద్యమ జోహార్లు...

కామ్రేడ్ కీ॥శే॥ అల్లు బాబూరావు గారు
కార్మికనేత, ఎఐటియుసి, సిపిఐ నాయకులు
జననం : 01-01-1951 మరణం : 28-02-2025

పడాల వెంకటరమణ, అధ్యక్షులు
కొండపు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి
నాయకులు : చిల్ల అప్పలసూరి
చిల్ల రాంపైడి, ఎరుసు అప్పలనరసయ్య
చిట్టివలస లేబర్ యూనియన్ (AITUC)

కానూరి రాంబాబు, కార్యదర్శి
మోర అప్పలరాజు, సహాయ కార్యదర్శి
నాయకులు : మావూరి సన్యాసమ్మ
చిల్ల నర్సింహులు
సిపిఐ భీమిలి ఏరియా సమితి

సంస్మరణ సభ : తేది.10-03-2025(సోమవారం) ఉ॥ 11గం॥లకు నుండి
చిట్టివలస జ్యూట్‌మిల్లు కళ్యాణ మండపం వద్ద జరుగును.

మొదటి పేజీ తరువాయి..

నేడు గోవాడ, తాడి, రేపు బల్క్‌ డ్రగ్‌ ప్రభావిత ప్రాంతాల్లో..

సిపిఎం ప్రజా చైతన్యయాత్ర

ర్యాంకీ, పరిశ్రమాధిపతులు లాభపడ్డారు. పరిశ్రమలకు భూములిచ్చిన రైతులు నష్టపోయారు. కంపెనీల కాలుష్యంతో తాడి ప్రజలు అనారోగ్యం బారినపడ్డారు. కాలుష్యం భరించలేక పూరోదిలి వెళ్లిపోతున్నారు. ఎన్నికలొచ్చినప్పుడల్లా తాడి తరలింపు హామీ ఇవ్వడమేగానీ తరలించలేదు. తరలింపునకు అవసరమైన రూ.56 కోట్లు మంజూరుచేస్తామని 2022 ఏప్రిల్‌ 28న ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి మర్చిపోయారు. 2019 ఫిబ్రవరి 6న తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను పెదముషిడివాడ తరలించడానికి రూ.57.63 కోట్లు విడుదల చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం జిఓ 29 విడుదల చేసింది. అదీ అమలు జరగలేదు. ఇళ్లు, భూములకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తే సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లిపోవడానికి తాడి ప్రజలు సానుకూలంగా వున్నారు. 2017లో సర్వే రద్దు చేసి, తాజాగా సర్వే నిర్వహించి మేజర్లందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని బాధిత ప్రజలు కోరుతున్నారు. ఈ క్రమంలో తాడిని తరలించని ప్రభుత్వం.. ఈ గ్రామానికి ఆనుకొని ఫార్మా పరిశ్రమల వ్యర్థాలు నిల్వచేసే ల్యాండ్‌ఫిల్‌కు మాత్రం అనుమతిచ్చింది.

బల్క్‌ డ్రగ్‌ ప్రాంతంలోని ప్రజల గోడు పట్టదా ?

నక్కపల్లి ప్రాంతంలో బల్క్‌ డ్రగ్‌ పార్కు(బిడిపి)ను స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ప్రజల గోడు పట్టించుకోకుండా 2001 ఎకరాల్లో పార్కు పనులకు ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం నుంచి వర్చువల్‌లో ఇటీవల శంకుస్థాపన చేశారు. బల్క్‌ డ్రగ్‌ పార్కును మత్స్యకారులు, రైతులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కాలుష్య పరిశ్రమలొస్తే తామీ ప్రాంతంలో బతకలేమని ఆందోళన చెందుతున్నారు. పరిశ్రమలొస్తే స్థానికులకు ఉద్యోగాలొస్తాయని హెటిరో డ్రగ్‌ కంపెనీ ఏర్పాటుకు ముందు చెప్పిన మాటలే ప్రభుత్వం ఇప్పుడూ చెబుతోంది. స్థానికుల అభ్యంతరాలను వినిపించుకోకుండా నక్కపల్లి మండలం రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్‌.పురం, వేంపాడులోని 2001 ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్‌ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) పనులు ప్రారంభించింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం కెపి పురం, కోదాడ మధ్య బల్క్‌ డ్రగ్‌ పార్కు ఏర్పాటును ఆ ప్రాంత ప్రజలు వ్యతిరేకించడంతో వైసిపి ప్రభుత్వం ఇక్కడకు తరలించింది. ఆ బల్క్‌డ్రగ్‌ పార్కు పనులను డి పట్టా, సాగు భూముల రైతులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించకుండానే కూటమి ప్రభుత్వం ఆరంభించింది.

రావికమతం : సోమవారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం గోవాడ సుగర్‌ ఫ్యాక్టరీని సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకుంటారని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న తెలిపారు. ఫ్యాక్టరీ పరిధిలోని రైతులందరూ ఉదయం 10 గంటలకు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చారు.

నక్కపల్లి : బల్క్‌ డ్రగ్‌ ప్రభావిత గ్రామాల్లో ఈ నెల 11న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటించనున్నారని, రాజయ్యపేట సభలో మాట్లాడనున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. ఆదివారం రాజయ్యపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు నాయకులు ఎం.మహేష్‌ బాబు, కె.కాశీరావు, జి.సోమేశ్వరరావు, సిహెచ్‌.కాశీ, బి.నూకరాజు, పి.రమణ, బి.అప్పలరాజు, జి.అప్పారావు, తాతాజీ పాల్గొన్నారు.

నర్సుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆశించకుండా తల్లిలాగ పని చేస్తుందన్నారు. గతంలో మహిళా సాధికారత కోసం మహిళలు పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక వైపు ఉద్యోగం, మరోవైపు ఇంటిని చూసుకుంటూ విజయవంతంగా మహిళలు ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. అలానే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, వృత్తి నిర్వహణలో ధైర్యంగా ఉండాలని అన్నారు. కెజిహెచ్‌లో ప్రతి వార్డులో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. శక్తి యాప్‌ను మహిళలు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, ఎన్‌టిఆర్‌ వైద్య సేవ ఛైర్మన్‌ సీతంరాజు సుధాకర్‌, కెజిహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.శివానంద, ఆంధ్ర మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సంధ్యాదేవి పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం

సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్‌ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతునివ్వడం శోచనీయమన్నారు. ప్లాంట్‌ పరిరక్షణ కోసం ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు, సైట్‌ లీడర్లు, మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా పిజిఆర్‌ఎస్‌

ప్రజల నుంచి వినతులు తీసుకోవాలని ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి వినతుల స్వీకరణ కార్యక్రమం మొదలవుతుందని, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు వినతులు సమర్పించవచ్చని సూచించారు.

జివిఎంసిలో..

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ, అన్ని జోనల్‌ కార్యాలయాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్‌) సోమవారం నిర్వహించబడుతుందని నగర మేయర్‌ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్‌ హరేంధిర ప్రసాద్‌ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు.

పోలీస్‌ కమిషనరేట్‌లో..

విశాఖపట్నం పోలీస్‌ కమిషనరేట్‌లో సోమవారం నుంచి యథావిధిగా పిజిఆర్‌ఎస్‌ కార్యక్రమం జరుగుతుందని సిపి కార్యాలయ అధికారులు తెలిపారు.

అభివృద్ధికి పెద్దపీట

100 రోజుల్లో రూ.189 కోట్ల విలువైన పనులు చేశాం

- 'ప్రజాశక్తి'తో విఎంఆర్‌డిఎ ఛైర్మన్‌ ఎంవి.ప్రణవ్‌ గోపాల్‌

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విఎంఆర్‌డిఎ పరిధిలో తాను బాధ్యతలు చేపట్టిన తొలి 100 రోజుల్లో రూ.189 కోట్ల విలువైన పనులు జరిగాయని, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని విఎంఆర్‌డిఎ ఛైర్మన్‌ ఎంవి.ప్రణవ్‌ గోపాల్‌ అన్నారు. విఎంఆర్‌డిఎ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ఎదురవుతున్న సవాళ్లను ఆయన 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

విఎంఆర్‌డిఎలో తాజాగా వచ్చిన మార్పులేంటి ?

నేను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సంస్థ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకుగాను ప్రజా దర్బార్‌ను ప్రారంభించాను. విఎంఆర్‌డిఎకు చెందిన లేఅవుట్లు, రహదారుల విస్తరణ, పార్కుల అభివృద్ధి, కల్యాణ మండపాల నిర్వహణ, పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి సామాన్య ప్రజలు ఎదుర్కొనే సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారం చూపుతున్నాను. ప్రజా దర్బారులో ఇప్పటి వరకూ 77 వినతులు రాగా 50 వరకు పరిష్కరించాం. వినతులపై ప్రతి 15 రోజులకూ ఒకసారి సమీక్ష నిర్వహిస్తున్నాం.

నగర సమస్యలు పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలేంటి ?

విశాఖ నగరంలోని పార్కింగ్‌ సమస్యను పరిష్కరించేందుకుగాను విఎంఆర్‌డిఎ కార్యాలయం ఎదురుగా 'దీ డెక్‌' మల్టీ లెవెల్‌ కార్‌ పార్కింగ్‌ భవనాన్ని రూ.87 కోట్ల వ్యయంతో నౌక నమూనాలో నిర్మిస్తున్నాం. ఈ భవనంలో 1.90 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో కమర్షియల్‌ స్థలం అందుబాటులో ఉంది. తీర ప్రాంత కోతను నియంత్రించే క్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాం. 50 ఎకరాల విస్తీర్ణంలో ఆరు రకాలైన 1200 మొక్కలను నాటాం. తీర ప్రాంతం కోతకు గురికాకుండా రూ.200 కోట్ల నిధులతో కేంద్ర ప్రభుత్వం, విఎంఆర్‌డిఎ 90:10 నిష్పత్తితో కోత నివారణ పథకాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నాం. పార్కుల్లో రక్షిత తాగునీటి సదుపాయానికి రూ.16.5 లక్షలను కేటాయించాం. త్వరలో సబ్‌ మెరైన్‌ మ్యూజియం, టియు 142 మ్యూజియం వద్ద రక్షిత తాగునీటి సదుపాయాన్ని అందు

బాటులోకి తీసుకురానున్నాం. కైలాసగిరికి వచ్చే సందర్శకులను మరింత ఆకర్షించేందుకు అడ్వెంచర్‌ గేమ్‌ జోన్‌ను అందుకుబాటులోకి తీసుకువచ్చాం. రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన పారా సైక్లింగ్‌, జిప్‌ లైనర్‌ సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. క్రీడలను ప్రోత్సహించేందుకు ఆరుబయట క్రీడా సముదాయాలను త్వరలో నిర్మించనున్నాం.

హెల్త్‌సిటీ, మాస్టర్‌ ప్లాన్‌ ప్రాజెక్టుల సంగతేంటి ?

వైద్య సదుపాయాల కల్పనకు అనకాపల్లి సమీపంలోని పరవాడ ఫార్మాసిటీలో 7.68 ఎకరాల స్థలంలో హెల్త్‌ సిటీ నిర్మాణానికి ఆమోదం వచ్చింది. రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తూ మాస్టర్‌ ప్లాన్‌లో భాగంగా 15 అత్యంత ప్రాధాన్యత కలిగిన రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. అందరినీ ఆకర్షించేలా బీచ్‌ రోడ్‌లోని సబ్‌మెరైన్‌, టియు 142 డివిజన్‌ తరహాలో మరో ఆకర్షణీయమైన హెలికాప్టర్‌ మ్యూజియంను అందుబాటులోకి తీసుకురానున్నాం. నగరంలోని పార్కులను ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించి అక్కడున్న వాకర్స్‌, సందర్శకుల అభ్యర్థన మేరకు మౌలిక సదుపాయాలను కల్పించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌, ఉప ముఖ్యమంత్రి పవన్‌ కళ్యాణ్‌ల నుంచి తగు ప్రోత్సాహం అందుతోంది.

ఎన్‌ఆర్‌ఐ మహిళ అనుమానాస్పద మృతి కేసులో..

కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం మూడో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మేఘాలయ హోటల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఎన్‌ఆర్‌ఐ మహిళ కేసులో విచారణ కొనసాగుతోంది. దర్యాప్తు తరువాతనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని మూడో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ అధికారులు ఆదివారం తెలిపారు. మృతురాలు అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయురాలుగా గుర్తించామని, విశాఖ వచ్చిన ఆమె ఇదే హోటల్‌కు తరచూ వచ్చిపోతోందని, ఇక్కడ రూమ్‌ అద్దెకు తీసుకుని ఉంటున్న వైద్యుడు శ్రీధర్‌ను ఆమె కలిసేదని పేర్కొన్నారు.

సదరు మహిళ ద్వారకానగర్‌లోని ఓ ప్రైవేటు స్థలం లీజ్‌ అగ్రిమెంట్‌ చేసుకోవడానికి అమెరికా నుంచి వచ్చిందని, శ్రీధర్‌ గదిలోని బాత్రూంలో చున్నీతో ఉరి వేసుకున్న స్థితిలో ఆమె మృతదేహం ఉన్నందున, ఎన్‌ఆర్‌ఐ మహిళ అయినందున దీనిపై మరింత లోతుగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని సిఐ రమణయ్య తెలిపారు.

ఒయాసిస్‌ ఫెర్టిలిటీ ఉచిత సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నానికి చెందిన ఒయాసిస్‌ ఫెర్టిలిటీ సంస్థ ఈ నెలలో తమను సంప్రదించే జంటలకు ఉచిత ఫెర్టిలిటీ సేవలు అందించనుందని సంస్థ కో-ఫౌండర్‌, మెడికల్‌ డైరెక్టర్‌ దుర్గాజీరావు తెలిపారు. సిరిపురంలోని ఒక ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫెర్టిలిటీ అనేది సైన్సు ఆధారిత సమగ్ర సంరక్షణ, ప్రత్యేకమైన చికిత్స ప్రణాళిక అని తెలిపారు. అధునాతన డయాగ్నొస్టిక్స్‌, నిపుణుల సంప్రదింపులు, అత్యాధునిక చికిత్స అందించడమే కాకుండా ఒయాసిస్‌ ఫెర్టిలిటీ మహిళలకు అవసరమైన పరిజ్ఞానంతో ఆలోచన శక్తిని కల్పిస్తుందని అన్నారు. అదే సమయంలో జంటలు కలిసి సంతానోత్పత్తి పొందేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. తమ సంస్థ మార్చి ఒకటి నుండి 31 వరకు భారతదేశంలోని తమ అన్ని కేంద్రాలలో ఉచిత ఫెర్టిలిటీ అసెస్మెంట్‌ అందిస్తోందన్నారు.

కేశవరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు :- మండల పరిధిలో గల బాబుసాల పంచాయితీ దోమెక్‌ లాడి గ్రామానికి చెందిన గొల్లూరి కేశవరావును గత నాలుగు నెలల క్రింద గంజాయి కేసులో విశాఖ టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా రహస్యంగా తీసుకొని వెళ్లి విచారణ పేరుతో చిత్రహింసలు పెట్టడంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మీపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌ కొర్రా త్రినాథ్‌ దోమకులాడి గ్రామంలో కుటుంబ సభ్యులతో జరిగిన ఘటనపై అడిగి తెలుసుకున్నారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో న ట్రైలర్‌ షేక్‌ దాదా తాటాకిళ్లు దగ్ధమైంది. రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షేక్‌ దాదా తాటాకింట్లో ఆకస్మికంగా మంటలు చెలరేగి, వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కలున్నవారు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని సామాగ్రి కాలి బూడిదైందని గ్రామస్తులు తెలిపారు. సర్వం అగ్నికి ఆహుతై కట్టుబట్టలతో మిగిలానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్‌ మిరియాల గణలక్ష్మి, గ్రామస్తులు ఆదివారం ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వపరంగా సాయం అందేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఆరిలోవ

జూ పార్కు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్రగాయాలయ్యాయి. మధురవాడ నుంచి ద్విచక్రవాహనంపై నగరంలోకి వస్తున్న ఓ యువకుడు జూ పార్కు సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు స్పందించి దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-ఆనందపురం

లైంగిక నేరాలు, రక్షణ చట్టంపై అవగాహన ఉండాలని విశాఖపట్నం ఏడవ అదనపు మెజిస్ట్రేట్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.రాధాకృష్ణ చెప్పారు. ఆనందపురం ఆరెంజ్ ఫంక్షన్ హాల్లో లైంగిక నేరాలు -రక్షణ చట్టంపై ఆదివారం న్యాయవిజ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ, న్యాయ చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టాలను తెచ్చి బాలబాలికలను సంరక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మండల విద్యాశాఖాధికారి జోగేంద్ర, ఐసిడిఎస్ అధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి -తగరపువలస

స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో పలు అంశాలపై ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన వర్క్ షాప్ ఆదివారంతో ముగిసింది. ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యాన ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సుమన, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ లావణ్య, కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూలో విజయవంతంగా ఆల్ ఉమెన్ వాక్

ప్రజాశక్తి - ఆరిలోవ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల, వన్యప్రాణి సంరక్షణ, పరిశోధన- విద్య, గ్రీన్‌వేవ్స్, గ్రీన్ పాస్‌తో కలిసి జూ పార్కులో ఆల్ ఉమెన్ వాక్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విభిన్న రంగాల్లో పనిచేస్తున్న మహిళలు, వివిధ కళాశాలల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గత మూడు రోజుల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. మొదటి రోజు టైడ్ పూల్ వాక్ ద్వారా సముద్ర జీవులను ఎలా సంరక్షించుకోవాలి, రెండో రోజు జీవ వైవిధ్య వాక్‌తో జూ పార్కులో విభిన్నమైన వృక్ష ప్రాణి సంపదను హైలెట్ చేసేవిధంగాను, బర్డ్ వాక్ ద్వారా పక్షుల జీవవైవిధ్యాన్ని అన్వేషణ అనే కార్యక్రమాల ద్వారా ముగిసింది. వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కల్పించడం, మహిళలను ఈ రంగంలో పాల్గొనడానికి ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

18న ఇపిఎఫ్ కార్యాలయం ముట్టడి

సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి -తగరపువలస : కనీస పింఛను డిఎతో కలిపి రూ.9వేలు చెల్లించాలని, హయ్యర్ పింఛను అమలు చేయాలని, ఇపిఎఫ్- 95 పింఛనుదారులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం, సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణంలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న విశాఖలోని ఇపిఎఫ్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చిట్టివలస జ్యూట్ మిల్లు పింఛనుదారుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక జిఆర్.భవన్‌లో ఆదివారం సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సంఘం అధ్యక్షులు కానూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ మాట్లాడుతూ, పింఛనుదారుల సమస్యలను పరిష్కరించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాల్లో వామపక్షాలు, ఇతర విపక్షాలు పెన్షనర్ల సమస్యలపై ఎన్నిసార్లు ప్రశ్నించినా కేంద్రప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భవిష్యత్తులో జరుగు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదంచేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, ఉపాధ్యక్షులు అప్పారావు, కోశాధికారి పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

సీనియర్ జర్నలిస్టు త్రిమూర్తులను సన్మానిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇల్లు లేదా ఇంటి స్థలం మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్ డిమాండ్ చేశారు. మధురవాడలోని శిల్పారామం జాతరలో ఏపీడబ్ల్యూజేఎఫ్ మధురవాడ యూనిట్ 2025కు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు వృత్తిపరంగా రక్షణ, పింఛన్లు, అక్రిడిటేషన్లు, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖపట్నం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎ.సాంబశివరావు మాట్లాడుతూ మధురవాడ ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టులపై దాడులకు దిగడం సరికాదన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.ఆనంద్ తన స్వాగత ఉపన్యాసంలో మధురవాడ ఏరియాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ నెల 28న విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఉగాది సంబరాల్లో జర్నలిస్టులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు బొక్కా త్రిమూర్తులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి బి.సీతారామమూర్తి, ఫెడరేషన్ ప్రతినిధులు నెలరాజు, రాజారావు, శ్రీహరి, గణేష్, సాయిగుణ, రంజన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'న్యూలైఫ్' వార్షికోత్సవం

వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లిలో ఉన్న న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు హాజరై మాట్లాడుతూ, లాభాపేక్ష లేకుండా సేవే ధ్యేయంతో పనిచేస్తున్న న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. 19 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంత పిల్లలకు అతి తక్కువ ఫీజులతో ఆంగ్ల విద్యను అందించాలని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె.శ్యామ్‌మాథ్యూస్ , కరస్పాండెంట్ జయశ్యామ్ ఈ పాఠశాలను గొట్టిపల్లిలో స్థాపించారని తెలిపారు. అప్పటి నుండి ఉన్నత విలువలతో పాఠశాలను నడుపుతున్నారని చెప్పారు. విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సిఐ సిహెచ్.వాసునాయుడు మాట్లాడుతూ, పిల్లలు చదువు పట్ల తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్లం, హిందీ భాషకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వాటితో పాటు మాతృభాష కూడా కీలకమన్నారు. సెల్ ఫోన్లకు విద్యార్థుల దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల నడవడికను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని చెప్పారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ, న్యూ లైఫ్ స్కూల్ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె.శ్యామ్‌మాథ్యూస్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ పాఠశాలను స్థాపించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామీణ ప్రాంతం విశిష్టత, సమాజంలో మహిళల పాత్ర, తండ్రి గొప్పతనం గురించి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను పాఠశాల డైరెక్టర్ కె.శ్యామ్‌మాథ్యూస్, కరస్పాండెంట్ కె.జయశ్యామ్, ప్రిన్సిపల్ కుమిలి రమేష్ అందజేశారు. పాఠశాల వార్షిక నివేదికను సీనియర్ ఉపాధ్యాయులు సునీత అందించారు. ఈ కార్యక్రమంలో గొట్టిపల్లి సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు దొంతల కనకరాజు, తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, బోని మాజీ సర్పంచ్ సూరాల సత్యవరప్రసాద్, కోరాడ తమ్ముునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... పోలీసులకు అందిన సమాచారం మేరకు కొమ్మాది హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డులో మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన అంగ రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుండి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రాజేష్‌ను రిమాండ్‌కు పంపించారు.

ట్రాక్టర్లు, జెసిబి స్వాధీనం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కొత్త చెరువు వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు పద్మనాభం సిఐ సిహెచ్.శ్రీధర్ సిబ్బందితో వెళ్లి మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జెసిబిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం పద్మనాభం తహశీల్దార్ కె.ఆనందరావుకు సమాచారం అందించారు.

కోడి పందేల శిబిరంపై దాడి

- నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - పరవాడ. : మండలంలోని తాడి గ్రామం లో కోడిపందేల శిబిరంపై ఆదివారంపోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మడకపాలెనికి చెందిన సేనాపతి పైడినాయుడు, తానాంకు చెందిన విరేసు అప్పారావు, లంకెలపాలెనికి చెందిన .వంజర శ్రీనివాస్, పరవాడకు చెందిన లాలం అప్పారావులను అరెస్టు చేసిసారు. నిందితుల నుంచి మూడు కోళ్లు, రూ.5800 నగదు సీజ్ చేశారు. పరవాడ సిఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన దాడిలో ఎస్ఐలు బి.కృష్ణారావు, బి.వై నాయుడు, హెచ్‌సి సాయికుమార్, కానిస్టేబుల్ జి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడు మృతి

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని బయ్యవరం శ్రీనివాస ఏజెన్సీ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు కశింకోట ఎస్ఐ కె. లక్ష్మణరావు తెలిపారు. మృతుడికి 30 నుండి 35ఏళ్ల వయస్సు ఉంటుందని, మృతుడి ఆచూకీ తెలిసినవారు కశింకోట పోలీసులకు 9440796088, 7780 62 0619 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఫేక్ బిల్లులు, ఓవర్ లోడ్‌తో ఇసుక రవాణా

-11 లారీలను పట్టించిన యూనియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఆనందపురం: ఫేక్ వే బిల్లులు, ఓవర్ లోడ్‌తో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని క్వారీ లారీ ఓనర్స్ యూనియన్ ప్రతినిధుల సమాచారంతో 10 ఇసుక లారీలను వేములవలస పెట్రోల్ బంక్ సమీపంలో స్థానిక పోలీసులు ఆదివారం పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. లారీ ఓనర్స్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం పోలీస్ స్టేషన్ వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న లారీ యజమానులకు, యూనియన్ ప్రతినిధుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మద్దిల వెంకటరమణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీ తీసుకొచ్చిన అనంతరం కొంతమంది ఫేక్ బిల్లులతో రోజుకు మూడు వరకు ఓవర్ లోడ్‌తో ఇసుకను తీసుకొస్తున్నారని తెలిపారు. శ్రీకాకుళం నుండి వస్తున్న లారీలను పలుచోట్ల ఓవర్ లోడు బిల్లులను పరిశీలించాల్సిన అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడంతో అక్రమంగా ఓవర్ లోడ్ ఇసుక రవాణా జరుగుతుందని పేర్కొన్నారు. సాధారణంగా ఓవర్ లోడుకు టన్నుకు రూ.2000, ఓనర్‌కు రూ.20 వేలు చొప్పున విధిస్తున్నారని తెలిపారు. నాయకుల పలుకుబడితో కొన్ని వాహనాలకు షరతులు వర్తించకపోవడంతో లారీ ఓనర్లు పలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఫేక్ బిల్లులను, ఓవర్ లోడ్లను అరికట్టి అందరికీ అధికారులు సమన్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్వారీ లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ బొట్ట సురేష్, వైస్ ప్రెసిడెంట్ బొట్ట సురేష్‌కుమార్, కొయ్య శ్రీను, కన్వీనర్ మద్దిల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ ఆవాల రామకృష్ణ, ఆనందపురం సింహాద్రి లారీ ఓనర్స్ యూనియన్ సెక్రెటరీ కోరాడ శ్రీను, సభ్యులు నమ్మి మాధవరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బిల్లులను పరిశీలిస్తున్నాం : సిఐ

వేములవలస గ్రామం సమీపంలో లారీ యూనియన్ నాయకులు మధ్య వివాదం కారణంగా 10 లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించామని సిఐ వాసునాయుడు తెలిపారు. లారీలు, ఇసుక బిల్లులను పరిశీలించి మైనింగ్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి చర్యలు చేపడతామని తెలిపారు.

పోర్టు సొంత నిధులతో అభివృద్ధి చేయాలి

దీక్షలో కూర్చున్న పద్మనాభరాజు తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్‌ను సొంత నిధులతో అభివృద్ధి చేయాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వి.ఎస్.పద్మనాభరాజు డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 160వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి పద్మనాభరాజు మాట్లాడుతూ, ఏటా రూ.వేల కోట్లు లాభాలు సంపాదిస్తున్నా పోర్టు ఉద్యోగుల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయటం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. దాంట్లో నాలుగో వాటా ఖర్చుపెట్టినా హాస్పిటల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. ఇలా ఆలోచించకుండా ప్రయివేటు వారికి అప్పగించాలని ఆలోచించడం దుర్మార్గమన్నారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రయివేటీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, రామలింగేశ్వరరావు, రాఘవులు, నాయుడు, సిహెచ్ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

చీరల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధిలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని వార్డు టిడిపి బిసి అధికార ప్రతినిధి బలగ సుధాకర్ ఆధ్వర్యాన మహిళలను ఘనంగా సత్కరించి చీరలు పంపిణీ చేశారు. వార్డు తెలుగు యువత అధ్యక్షులు మామిడి మోహన్ కేక్ కట్ చేసి మిఠాయి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి కేతా సత్యనారాయణ, సీనియర్ నాయకులు తులసీపార్వతి, జిల్లా కమిటీ నాయకులు కొండమ్మ, బుజ్జమ్మ, కళావతి, సంధ్య, పార్వతి, సత్యనారాయణ, రామచంద్రరావు, గోపి, పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరావు మాట్లాడుతూ, రౌడీలు కదలికలపై నిఘా ఉంటుందని చెప్పారు. వివాదాలు, సెటిల్‌మెంట్లలో తల దూర్చకుండా ఉండాలని సూచించారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రక్తదాన శిబిరం ప్రారంభంలో గంట్ల శ్రీనుబాబు తదితరులు

రక్తదానం

ప్రజాశక్తి-పెందుర్తి : సుజాతనగర్ శ్రీ సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యాన ఆదివారం ఆనంద సాయి మందిరంలో విక్టోరియా ఆసుపత్రి డాక్టర్ యు.జీవన్‌సంతోష్‌కుమార్, పలువురు వైద్యుల సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు దాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరం ద్వారా సుమారు 50 యూనిట్ల రక్తం సేకరించారు. స్థానిక కార్పొరేటర్లు సేనాపతి వసంత శంకర్రావు, ముమ్మన దేవుడు, సత్యసాయి ఆనంద నిలయం ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు శ్రీనుబాబు, జనసేన నాయకులు కంచిపాటి మధు శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. సత్య సాయి భక్తులు చేస్తున్న సేవ ఎంతోమందికి ఆదర్శనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి.జ్యోతి, ముక్క గోపి, పి.తాతారావు, టి.సీతారామయ్య, సిహెచ్.శ్రీనివాసరావు, సిహెచ్.రవిశంకర్ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-మధురవాడ : శిల్పారామం జాతరలో నిర్వహించు వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం జోష్ డాన్స్ అకాడమీచే శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఇందులో భాగంగా బజ్జ బుజ గణపయ్య, రంగిని కల్యాణం, వెవవెట్టుకు ఉయ్యాల, భరత వేదంగ, రామరామ రం రాం రాం, రాజాంకొండమీద, ఘల్లుఘల్లు, జోదేద్దుల బండి వంటి గేయాలకు ఈశ్వరి, హరిక, గాయిత్రి, మనోజ్ఞ, రోహిత, ప్రగతి, లక్ష్మి, లావణ్య, అమ్ము, ప్రహర్షిత, కుష్విల్, జహ్నిక నృత్య ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జాతర పరిపాలనాధికారి టి.విశ్వనాధరెడ్డి పర్యవేక్షించారు.

నృత్యప్రదర్శనలిస్తున్న చిన్నారులు

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఆనందపురం : సిఎం సహాయ నిధి నుండి గీత కార్మిక కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. ఆనందపురం గ్రామానికి చెందిన చెట్టి ఎర్రినాయుడు 2024 అక్టోబర్ 23న ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి కింద పడడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. క్యూ1 హాస్పిటల్‌లో ఆపరేషన్ చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర యాత సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు అంగటి రాము, స్థానిక నాయకులు కలిసి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1,65,578 మంజూరు చేయించి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము, సినగం పెద్ద రామారావు, మాజీ వైస్ ఎంపిపి మీసాల సత్యనారాయణ, కొట్యాడ లక్ష్మణమూర్తి, కుప్ప పోతయ్య, చుక్క రాము, కుప్ప బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పెందుర్తి : రాష్ట్రంలో అందరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో పెందుర్తి, అయ్యప్ప కాలనీ (జెఎన్ఎన్ఆర్ఎం)లో ఇంటి స్థలాల కోసం అక్కడి ప్రజల చేత సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు వై.రాంబాబు దరఖాస్తులు ఆదివారం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ దరఖాస్తులను సోమవారం పెందుర్తి తహసీల్దారు కార్యాలయం అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అందరికీ సొంతిల్లు సాధించడం సిపిఐ సంకల్పమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సభ్యులు అరుణ, రజినీ, రామలక్ష్మి, నాగేష్, రాజశేఖర్, విజయ, భోగేష్ పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : గతేడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జ్యూట్ కార్మికవాడలో నివసిస్తున్న పిట్ట నరసింగరావు తీవ్ర గాయాలై మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని టిడిపి జిల్లా కార్యదర్శి పిట్ట సురేష్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంవిపి.కాలనీలోని గంటా నివాసంలో ఆదివారం కలిశారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న నరసింగరావు చనిపోవడంతో భార్య, ఇద్దరు పిల్లల పోషణ కష్టంగా ఉందని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే గంటాను కలిసిన వారిలో సురేష్‌తో పాటు టిడిపి ఒకటో వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, ఎం.వరలక్ష్మి, పి.రామారావు, కొప్పల కృష్ణ ఉన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

సీతమ్మధార : మహిళలు అని రంగాల్లోని రాణించి భవిష్యత్తు తరానికి సరైన మార్గాన్ని చూపించాలని నవ్యాంధ్ర మహిళా సంఘం ప్రతినిధి రాములమ్మ అన్నారు. అంబేద్కర్ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలందించిన మంగమ్మ (కుక్), అను (ఆర్ఎంపి), భవాని (స్టాఫ్ వర్కర్), బ్యుల రాణి (న్యాయవాది)లను సత్కరించారు. మహిళలు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ చూపాలని ఆమె కోరారు.

ఘనంగా బోడిదొర వర్ధంతి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ అల్లూరి, మల్లు దొరల సేవా సంఘం ఆధ్వర్యాన పూర్వపు పార్లమెంట్ సభ్యుడు మల్లు దొర వారసుడు బోడిదొర ప్రథమ వర్ధంతిని జివిఎంసి 65వ వార్డు పరిధి భానోజీతోటలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు హాజరై బోడిదొర చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రధాన అనుచరుడిగా ఉన్న మల్లు దొర ఆశయాలను పాటిస్తూ వారి కుమారుడు ప్రజా సేవలో ఉంటూ అందరి అభిమానాన్ని పొందారని చెప్పారు. మల్లు దొరల సంఘం ద్వారా ఏటా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేద అభ్యున్నతికి పాటు పడుతున్నారని కొనియాడారు. అనంతరం పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శివంగి నాగేశ్వరరావు, వార్డు టిడిపి కార్యదర్శి కర్రి కృష్ణ, వెంకటేశ్వరరావు, శక్తి కామేశ్వరరావు, ఉమా శంకర్, భాస్కర్, జయ, పద్మ పాల్గొన్నారు.

నేడు కార్మిక నేత బాబూరావు సంస్మరణ సభ

అల్లు బాబూరావు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -తగరపువలస : కార్మిక నేత అల్లు బాబూరావు సంస్మరణ సభ సోమవారం ఉదయం 11 గంటలకు చిట్టివలస జ్యూట్ మిల్లు కల్యాణ మండపంలో జరుగనుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి జానపద కళాకారులచే కళా రూపాల ప్రదర్శన, మధ్యాహ్న భోజనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులతో పాటు చిట్టి వలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి), సిపిఐ స్థానిక నాయకులు ఆదివారం తెలిపారు. బాబూరావుకు భార్య లక్ష్మి, కుమారుడు నరేంద్ర కుమార్, కుమార్తె దివ్య గౌరి ఉన్నారు.

త్రికరణ శుద్ధితో బాధ్యతలు..

కార్మిక నేతగా, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, కళాకారునిగా ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులైన అల్లు బాబూరావు గత నెల 28న మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడ్డారు. సిపిఐకి అనుబంధ సంఘంగా ఉన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులుగా ఉన్న వాదా గురుమూర్తి ప్రోత్సాహంతో కమ్యూనిస్టు పార్టీలోకి ఆకర్షితులైనట్లు ప్రస్తుత సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు ప్రజాశక్తికి తెలిపారు. చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి)లోను, సిపిఐలోనూ చురుగ్గా పనిచేసిన విషయం విదితమే. గతంలో పార్టీ మండల కార్యదర్శిగా, చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అంతేగాకుండా 2011లో చిట్టివలస ప్రాంతీయ పెన్షన్ సంఘాన్ని ఇతనే స్థాపించారు. ఆ సంఘానికి వ్యవస్థాపక అధ్యక్షులుగానూ, 1994 నుంచి కొంత కాలం పాటు కళాభారతి సంస్థ అధ్యక్షులుగానూ పనిచేశారు.

వ్యవసాయ కుటుంబం నుంచి.. వామపక్ష భావజాలం వైపు...

సొంతూరు పద్మనాభం మండలం తునివలస గ్రామంలో 1951 జనవరి 1న జన్మించారు. ఇదే మండలం రెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఏడవ తరగతి వరకు చదివారు. అప్పటికే అభ్యుదయ భావాలు పుణికి పుచ్చుకున్న ఇతను క్రమంగా వామ పక్ష భావజాలం వైపు ఆకర్షితులయ్యారు. వ్యవసాయ కుటుంబం నుంచి వామపక్షవాదిగా, కార్మిక నేతగా పేరు గడించారు. అనేక సభల్లో కార్మిక సమస్యలే కాదు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలపై అనర్గళంగా మాట్లాడేవారు. మంచి వక్తగా పేరుంది. తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగానే జీవించారు.

జ్యూట్ మిల్లు కార్మికునిగా..

1974లో చిట్టివలస జ్యూట్ మిల్లులో చేరి స్పిన్నింగ్ విభాగంలో పని చేసే వారు. మిల్లులో కార్మికునిగా పని చేస్తూనే కార్మికుల సమస్యలపై పోరాడే వారు. 1974లో చిట్టి వలస జ్యూట్ మిల్లులో నెలకు కేవలం రూ.250 జీతానికి జాయిన్ అయిన ఇతను 2009లో రిటైరైన నాటికి రూ.5 వేలు వేతనం పొందారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నికరంగా పోరాడే వారు. అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. ఎన్నో సార్లు నిర్బంధాలను సైతం ఎదుర్కొన్నారు.

ప్రజారోగ్య వేదిక వైద్య శిబిరానికి స్పందన

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దొడ్డి రాము నాయుడు నిలయం (సిఐటియు కార్యాలయంలో) ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రజారోగ్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ప్రతి రెండు నెలలకు ఒకసారి రెండవ ఆదివారం బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం వ్యాధిగ్రస్తుల కోసం వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ మీనేంద్ర కుమార్ పాల్గొని వైద్య సేవలు అందించారు. ప్రజా ఆరోగ్య వేదిక స్వచ్ఛంద సేవకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆధ్వర్యంలో విజయవంతంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. శ్రామికులు, మధ్యతరగతి, అన్ని వర్గాల పేషెంట్లు, సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రజా ఆరోగ్య వేదిక ప్రతినిధులు కోరారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పైపులైన్ మార్పిడి పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్

ప్రజాశక్తి - యలమంచిలి : రానున్న వేసవిలో మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడికి ఎటువంటి ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమకుమారి అన్నారు. ఆదివారం ఎర్రవరం సంపు నుండి రామచంద్రమ్మ కొండపై ఉన్న మంచినీటి ట్యాంకులకు నీరు తీసుకెళ్లే పైపులైన్ తుప్పుపట్టిపోవడంతో వాటి స్థానే కొత్త పైపుల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రామచంద్రమ్మ కాలనీ, పాతవీధి, తులసీనగర్ వాసులకు నీరందించే ట్యాంకు పైపులైన్ పాడవ్వడంతో బాగు చేయిస్తున్నామన్నారు. రామచంద్రమ్మ కాలనీలో లీకౌతున్న 200 ఎంఎం పైప్‌లైన్ మార్పు చేస్తున్నట్లు ఏఇ సుబ్బారావు తెలిపారు.

ఘనంగా బౌద్ధ సమ్మేళనం

బౌద్ధ సమ్మేళనంలో పాల్గొన్న బౌద్ధ ఉపాసకులు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బౌద్ధ పర్యాటక క్షేత్రం శంకరం బొజ్జన్న కొండ వద్ద ఆదివారం బౌద్ధ సమ్మేళనం నిర్వహించారు.రాష్ట్ర నలుమూలల నుండివచ్చిన బుద్దిస్ట్ సొసైటీ, బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు, బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ అభిమానుల సమూహంతోపాటు విదేశీ బౌద్ధ భిక్షువులు, పాల్గొన్నారు. ముందుగా బొజ్జన్నకొండ మెట్లమార్గం ద్వారా బౌద్ధ పతాకాలు బుద్ధుని ప్రతిమలతో బొజ్జన్నకొండపైకి శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొండపై గల బుద్ధుని గుహలో ప్రధాన బౌద్ధ స్థూపం వద్ద బౌద్ధ బుద్ధునికి ప్రత్యేకపూజలు, ప్రార్థనలు నిర్వహించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని బుద్ధునికి కొవ్వొత్తులు వెలిగించి పూలు, పండ్లతో బుద్ధునికి నివాళలర్పించారు. రాష్ట్ర బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు వై .హరిబాబు, విశాఖ బౌద్ధ సంఘాలసమాఖ్య గౌరవాధ్యక్షులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్, పల్లా బాబ్జీ, బొడ్డు కళ్యాణరావు, పి.రాంబాబు, ఎన్. గంగాధర్, వి.వి. దుర్గారావు, బోర వేణుగోపాల్ గౌతమ్, గొంది నవీన్,భరత్ కుమార్, నేల పూడి బాలరాజు, నూకరాజు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యత

జాతీయ భద్రతా వారోత్సవ ర్యాలీలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్

ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్మికులు భద్రంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుందని కార్మికుల భద్రతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం అవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.కార్మికుల భద్రతకు ప్రభుత్వమే కాదు యాజమాన్యం కూడా బాధ్యత వహించి, తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆదివారం 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ర్యాలీని ఎమ్మెల్యే విజయకుమార్, కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కార్మిక, కర్మాగార బాయిలర్ వైద్య బీమా శాఖ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ స్టేడియం నుంచి పెంటకోట కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న అనకాపల్లి నుంచి 54వ భద్రత వారోత్సవాలను ప్రారంభించా మన్నారు. వారోత్సవాలలో కార్మికులే కాకుండా సామాన్య ప్రజానీకం కూడా భాగస్వాములు కావాలని కోరారు. 'సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ క్రూషియల్ ఫర్ వికసిత్ భారత్ 2047' థీమ్‌తో ఈ ఏడాది జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థిదశ నుంచే భద్రతపై అవగాహనకు వారికి వివిధ పోటీలను నిర్వహించామన్నారు. . యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ యాజమాన్యం, కార్మికుల సంయుక్త కక్షితో జీరో యాక్సిడెంట్‌కు కృషి చేయాలన్నారు జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత కర్మాగారాల భద్రతపై దృష్టి పెట్టానని, రిశ్రమలలో ప్రమాదాలపై కార్మికులకు మాక్ డ్రిల్ నిర్వహించి భద్రత పై శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులందరికీ మంత్రి ప్రశంసాపత్రాలు, మెమొంటోలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ డైరెక్టర్ చంద్రశేఖర్ మూర్తి, కర్మాగార సంయుక్త ముఖ్య తనిఖీ అధికారి జె.శివశంకర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం నాగ రాజారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ముకుందరావు, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, నేవీ, ఫైర్ సర్వీసెస్, హెచ్.పి.సి.ఎల్, ఎన్‌టిపిసి, హెటిరో ఫార్మా కంపెనీలు అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లోని ఫ్యాక్టరీల కార్మికులు పాల్గొన్నారు. అంతకుముందు గవరపాలెం నూకాంబికను మంత్రి సుభాష్ దర్శించుకుని పూజలు చేశారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఇఇ సుజాత పాల్గొన్నారు.

సిఆర్‌పిలకు హెచ్‌ఆర్ పాలసీ తీసుకొస్తాం

రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు

రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావును సత్కరిస్తున్న సిఆర్‌పిలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలల స్థాయిలో కీలకమైన విధులు నిర్వహిస్తూ, విశేష సేవలందిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సిఆర్‌పి)లకు హెచ్.ఆర్. పాలసీ అమలుకు కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం అనకాపల్లిలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ హెచ్‌ఆర్ పాలసీ సహా, పలు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో జిల్లా ఫెడరేషన్ అధ్యక్షులుగా సబ్బవరపు శంకర్రావు (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి (రోలుగుంట), కోశాధికారిగా మూర్తి (రాంబిల్లి), గౌరవ అధ్యక్షులుగా శ్యామ్ (రావికమతం), ఉపాధ్యక్షులుగా రామకృష్ణ (గొలుగొండ), కన్వీనర్ గా రమణ (సబ్బవరం) కో-కన్వీనర్ గా పి గంగాధర్ (దేవరాపల్లి), మహిళా కార్యదర్శిగా పద్మజ (అనకాపల్లి) కమిటీల సభ్యులుగా సతీష్ (రోలుగుంట) శ్రీనివాస్ రెడ్డి (ఎలమంచిలి), శివప్రసాద్ (అచ్యుతాపురం), గోవింద్ (మునగపాక), టి శ్రీనివాసరావు (బుచ్చియ్య పేట), చిరంజీవి (ఎస్ రాయవరం) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు జి బి.శ్రీనివాసరావులు ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యవర్గం సత్కరించారు.

కూటమి ప్రభుత్వ నిర్వాకంతో

గోవాడ సుగర్స్ మనుగడ ప్రశ్నార్థకం

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సమావేశం లో మాట్లాడుతున్న అమర్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట ::కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వలన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి, చోడవరం వైసిపి ఇన్‌ఛార్జి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. ఆదివారం సీతయ్యపేటలో విలేకరులతో మాట్లాడుతూ, .గత వైసిపి ప్రభుత్వ హయాంలో గోవాడ సుగర్స్‌కు రూ.89.9 కోట్లు ఆర్థిక సాయం అందించి, నిలిపామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్యాక్టరీకి కనీసం ఒక్క రూపాయి సాయం చేయలేదన్నారు. పాలకుల నిర్లక్ష్యం, అసమర్థత వల్ల గతేడాది బకాయిలు చెల్లించకపోగా, క్రషింగ్‌ను ఆలస్యం ప్రారంభించడంతోపాటు కొద్దిరోజుల్లోనే 13సార్లు అంతరాయంతో అస్తవ్యస్తంగా నిర్వహిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విపక్ష నేతలపై కక్షసాధింపులపై ఉన్న శ్రద్ధ, గోవాడ సుగర్స్ అభివృద్ధి, రైతుసంక్షేమంపై కూటమి ప్రభుత్వం పెట్టాలని, గోవాడ సుగర్స్‌కు ఊపిరిపోయాలని కోరారు. గోవాడ సుగర్స్ వద్ద రైతులతో వైసిపి నేతల ముఖాముఖి సోమవారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు జెడ్‌పిటిసి దొండా రాంబాబు, వైసిపి మండల అధ్యక్షుడు కె.అచ్చం నాయుడు పాల్గొన్నారు.

తాడిలో సిపిఎం అధ్యయన యాత్ర

ఇంటింటికీ వెళ్లి సమస్యలను సేకరించిన నేతలు

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు సందర్శన

ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పరవాడ.: మండలంలోని తాడి గ్రామంలో ఆదివారం సిపిఎం నేతలు బృందం అధ్యయన యాత్ర చేపట్టింది. ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రుత్తల. శంకరరావు మాట్లాడుతూ తాడి గ్రామంలో ప్రజలు తీవ్రమైన కాలుష్యంతో కిడ్నీ, చర్మం, ఊపిరితిత్తులు,కళ్లు, నరాల బలహీనత, ఎముకలు బలహీనపడడంతోపాటు ప్రాణాంతక కేన్సర్ బారిన పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలుష్యం కోరల నుంచి తమకు విముక్తుల్ని చేయాలని గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నా అధికారులు, నేతలు స్పందించని స్థితిలో ఈనెల 10న సోమవారం సాయంత్రం 4గంటలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తాడి గ్రామాన్ని సందర్శించనున్నారని, ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు గనిశెట్టి సత్యనారాయణ, కండేపల్లి. అప్పలరాజు, లక్ష్మి, పార్వతి, అప్పల నరసింహ పాల్గొన్నారు.

313 మందికి బ్రాండిక్స్ కంటి అద్దాలు

రోగులకు కంటిపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం 165వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించిన నేత్రవైద్యులు, వారిలో 313 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. 123 మందికి మందులు పంపిణీ చేశారు. 50 మంది రోగులకు అంతరకుసుమాలున్నట్లు గుర్తించి, ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. మండుటెండలో కంటి వైద్య శిబిరానికి వచ్చిన కంటి రోగులకు మజ్జిగ, ఫలహారం భోజన సదుపాయాన్ని బ్రాండ్స్ యాజమాన్యం సమకూర్చింది.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఆర్.శివరాంపురంలో స్థానికుడైన దేవర రాజారావు తన సొంత నిధులతో టెన్త్ విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణగా అందించారు. టెన్త్ పరీక్షలకు ఉపయోగపడే అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, ఆరేజర్, షార్ప్‌నర్,స్కేల్ వంటి వస్తువులను పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. సర్పంచ్ నమ్మి నీరజ అప్పలరాజు, చందక శ్రీనివాసరావు, దేవర అప్పలరాజు, నమ్మి చిలుకునాయుడు, పల్లా పోలినాయుడు, మొల్లి ముసిలినాయుడు, దేవర అప్పలనాయుడు, దేవర బెన్నయ్య, చందక అప్పలరాజు, దేవర తాతాజీ, బోయిన నారాయణమూర్తి, నమ్మి శ్రీను, నమ్మి రాజు పాల్గొన్నారు.

తెరువుపల్లిలో నూకాంబిక విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని తెరువుపల్లిలో నూతనంగా నిర్మించిన నూకాంబికా ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఉత్తరాంధ్ర జనసేన రాజకీయ వ్యవహారాల కన్వీనర్ సుందరపు వెంకట సతీష్‌కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. రాష్ట్రరోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఎంపిపి బోదెపు గోవిందరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నసమారాధన జరిగింది.

ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ చేయూత

ప్రజాశక్తి- దేవరాపల్లి : ప్రతి కుటుంబం ఆర్థిక ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. వ్యక్తులు, గ్రూపులుగా ఆర్థిక సహకారానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసామన్నారు. ఆదివారం రైవాడ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ, దేవరాపల్లి మండలాన్ని నాటుకోళ్ల పెంపక హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వమే 45 నుంచి 50 శాతం రాయితీ ఇస్తుందని, మిగతా పెట్టుబడి సొమ్మును ఆరు శాతం స్వల్ప వడ్డీపై ప్రభుత్వమే బ్యాంకు గ్యారంటీ ఇచ్చి లబ్ధిదారుడికి సమకూరుస్తుందన్నారు. కె.కోటపాడు మండలాన్ని ఉద్యాన హబ్‌గా తయారుచేస్తామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రతి మండలంలో రెండు పంచాయతీల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడతామని, విజయవంతమైతే విస్తరిస్తామన్నారు. రైవాడ జలాశయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడిఉందని, త్వరలో రూ.336కోట్లు మంజూరు కానున్నాయన్నారు.

5వ షెడ్యూల్డ్ సమస్యపై అసెంబ్లీలో చర్చిస్తా

మైదాన ప్రాంతం గిరిజనులను ఐటిడిఎలో విలీనం చేసే అంశంపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానన్నారు. కేంద్రమంత్రి రామ్మోహననాయుడు, ఎంపీ సిఎం రమేష్ ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా, కేంద్రప్రభుత్వం నివేదిక కోరిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చొరవతో గవర్నర్ ఆమోదంతో నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు కృషి చేస్తానన్నారు. 13న చీడికాడలో విశ్వకర్మ యోజనపై సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపిపి తిరుపతి భాస్కర్ రావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ సర్పంచ్ పెద్దాడ వెంకటరమణ, గంధం జగన్నాథం, కడిమి నాగేశ్వరరావు, దొగ్గ దేముడునాయుడు, బంధం అప్పలరాజు, సామల నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

200 మందికి ఉచిత వైద్యసేవలు

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని మూలజంప గ్రామంలో విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో అల్లూరి విజ్ఞాన కేంద్రం, శారద ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి, 200మంది రోగులకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడునాయుడు తెలిపారు. గైనకాలజీ, అంకాలజీ, అప్తమాలజీ, జనరల్ మెడిసిన్ తదితర ఏడు విభాగాలకు చెందిన వైద్యనిపుణులు పాల్గొని రోగులకు వైద్యసేవలు అందించారు. బిపి, సుగర్ పరీక్షలతోపాటు వ్యాధి నిర్ధారణకు ఇసిజి, ఇతర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కె.ఆది సత్యనారా యణ, ఉరుకోటి అప్పారావు, వి.వెంకనాయుడు, వేగి శ్రీను, ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలోవైద్యశిబిరం నిర్వహించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటరావు, సర్పంచ్

ప్రజాశక్తి- సబ్బవరం : ముత్యాలమ్మ తల్లి పండగ సందర్భంగా రావులమ్మపాలెంలో గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న విలేజ్ క్రికెట్ టోర్నీని ఆదివారం లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ అధినేత చొక్కాకుల వెంకటరావు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఈనెల 12 వరకు నిర్వహించే టోర్నీలో విజేతలకు రూ.20వేలు నగదు, రన్నరప్‌కు రూ.15వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లుకు రూ.10వేలు, రూ.ఐదు వేలు నగదుతోపాటు షీల్డ్‌లను బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడుబాబు, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, పిఎసిఎస్ కార్యదర్శి గొంప రమణ, గొంప ముత్యాలనాయుడు, బోకం జగదీష్, మేడపురెడ్డి జగన్నాథం, కొల్లి దాసు, జక్కాన శ్రీనివాసరావు, గొర్లి ఎర్రినాయుడు, బోకం శ్రీనివాస్, శీరంరెడ్డి రామకృష్ణ, గొంప రమణ, అప్పలనాయుడు,

నూకాంబిక జాతరకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం నూకాంబిక జాతరకు భారీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకాంబిక జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో నెలరోజుల పాటు వేడుకలను అనకాపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యేకు దేవాదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ ఈవో ఎన్ సుజాత స్వాగతం పలికి,ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు.

చెత్తసేకరణ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాల్టీలో చెత్త సేకరణకు రూ29లక్షలతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సమకూర్చిన కాంపెక్టర్ వాహనాన్ని ఆదివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలా రమాకుమారితో కలిసి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఎఇఇ గణపతి సుబ్బారావు, మేనేజర్ విజయకుమార్, వైస్‌ఛైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బొడ్డేటికి 'కళాతపస్వి' దామెర్ల పురస్కారం

దామెర్ల పురస్కారం స్వీకరిస్తున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి- చోడవరం రూరల్.: విలక్షణ శైలితో తెలుగు చిత్రకళా రంగంలో ప్రత్యేకతను చాటుకుంటున్న విజయనగరం జిల్లా విశ్రాంత డ్రాయింగ్ టీచర్, సీనియర్ చిత్రకారుడు సూర్యనారాయణ ప్రతిష్టాత్మక కళాతపస్వి దామెర్ల రామారావు పురస్కారాన్ని అందుకున్నారు. చోడవరం చిత్రకళా పరిషత్ ద్వారా చిత్రకళాభివృద్ధికి కృషి చేస్తున్న వారి సేవలను గుర్తించి మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. చిత్రకళా తపస్వి దామెర్ల రామారావు జయంతి, మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మచిలీపట్నం సన్ స్టార్ స్కూల్‌లో అకాడమీ ఆధ్వర్యంలో చిత్రకళా శిబిరం ఏర్పాటు చేశారు. అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి బి.ఎస్.వి.రమేష్, అధ్యక్షులు పి.ఎల్.మోహన్, ఉపాధ్యక్షులు పిఎస్ఎన్ ప్రసాద్ ల సమక్షంలో కాకినాడ ఆంధ్ర బ్యాంక్ విశ్రాంత జిల్లా చీఫ్ మేనేజర్ ఎం సుబ్రహ్మణ్యేశ్వర స్వామిపురస్కారాన్ని ప్రదానం జరిగింది. బొడ్డేటి సూర్యనారాయణతో మరో ఎనిమిది మంది చిత్రకారులకు దామెర్ల పురస్కారాలను ప్రదానం చేశారు. సూర్యనారాయణకు పురస్కారంపై చోడవరం చిత్రకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రేమ సమాజం రాజు, ఒఆర్ఆర్‌సి ప్రసాద్, కొండలరావు, ప్రకాష్, కన్యయ్యశెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలావుండగా, గిరిజన జీవ వైవిధ్యాన్ని కళ్లకు కట్టినట్లు కాన్వాస్ పై ఆవిష్కరించే సూర్యనారాయణ మూర్తి చేసిన చిత్రాలు ఆహూతులను, అతిథులను అలరించాయి.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -వద్దాది :ఈ నెల 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం వడ్డాదిలో చోడవరం ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు అధ్యక్షతన జనసేన శ్రేణులతో సమావేశమయ్యారు.ఆవిర్భావ సభ విజయవంతానికి తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మాడుగుల, నర్సీపట్నం ఇన్‌చార్జిలు రాయపరెడ్డి కృష్ణ, రాజాన వీరసూర్యచంద్ర, అడపా నరసింహమూర్తి, కర్రి తమ్మునాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఈనెల 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభను విజయవంతంచేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించి మహిళలకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. పిఏసి సభ్యుడు కోన తాతారావుకు చిత్రపటం బహూకరించారు.

ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించరా?

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని గోకివానిపాలెం గ్రామంలో నిర్మాణం పూర్తి చేసిన హెల్త్‌క్లినిక్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామ ప్రజలు కోరుతున్నారు, 2023లో గత ప్రభుత్వ హయాంలో రూ.20.80లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయి సర్వాంగసుందరంగా భవనం సిద్ధమైనా, దీన్ని ప్రారంభించక, వినియోగంలోకి తేకుండా అలాగే వదిలేశారు. ఇక్కడ భవనం అందుబాటులో లేక వైద్యసేవలు అందుబాటులోకి రాక తాళ్లపాలెం పిహెచ్‌సికి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు

నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని హెల్త్ క్లినిక్ భవనం

వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఈ.బోనంగి ఫార్మసిటీ కాలనీలో కొండపైన్న అభయ వెంకటేశ్వరస్వామి ఆలయ నూతనకమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. 2025-28 సంవత్సరాలకు ఆలయ కమిటీ అధ్యక్షులుగా బుగిడి రామ గోవిందరావు, కార్యదర్శిగా లాలం అప్పలనాయుడు, కోశాధికారిగా పత్తమట్ల లోవరాజు, కమిటీ సభ్యులుగా గొర్లి కనకారావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, సిహెచ్‌వి సత్యనారాయణ, రేలంగి ధనరాజు, ఎంవిజి రామశేఖర్, బొడ్డు అమరావతి, సాలాపు కేదారి కనక సంతోష్ (దీపిక) ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి సబ్‌స్టేషన్ పరిధిలో రాంబిల్లి 11 కెవి రూరల్ ఫీడర్ విద్యుత్ లైన్ నిర్వహణ పనుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుత పాలెం, యలమంచిలి ఎర్రవరం, కొత్తపాలెం గృహ, వ్యవసాయ కనెక్షన్లకు కరెంట్ ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మళ్ల సురేంద్రకు సత్కారం

సురేంద్ర ను సత్కరిస్తున్న న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ భాస్కరరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం గౌరీ గ్రంధాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రముఖ వైద్యులు అంతర్జాతీయ న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ మళ్ల భాస్కరరావు పాల్గొని ముందుగా రిజిస్టర్ చేయించుకున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సమావేశం లో జ్ఞానశక్తి కోల్పోవడంపై విద్యార్థులకు రెండు గంటలపాటు అవగాహన కల్పించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మళ్ల సురేంద్రను గౌరీ గ్రంధాలయం కమిటీ తరపున మళ్ల భాస్కరరావు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెసుల వెంకటరమణ, మళ్ల బాపునాయుడు, ఎస్ఎఫ్‌ఐ సత్యనారాయణ, బుద్ద తాతారావు, మళ్ల సూరిబాబు, కాంగ్రెసుల జగ్గారావు పాల్గొన్నారు.

మదుతూరులో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

ఆర్ఓ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని మదుతూరు గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌ను ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన భార్గవి అమ్మోనియా యాజమాన్యం, మేనేజింగ్ డైరెక్టర్ ఎం కొండలరావుకు ధన్యవాదాలు తెలిపారు. జనసేన జిల్లా కార్యదర్శి ఎం శ్రీవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జి, రాజాన నానాజీ, ఎన్. రామకృష్ణ, శనివాడ ఆనందరావు, ఎం త్రినాథస్వామి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అనకాపల్లి : కేన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ కాళ్ల మురళీధర్ అన్నారు. ఆదివారం స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధి, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులో మాట్లాడుతూ, కేన్సర్ ఎలా వస్తుంది? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ముఖ్యంగా మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌పై అవగాహన కల్పించారు. పొగాకు, ఖైనీ, గుట్కా నమలడం, అడ్డపుగ పెట్టడం వలన నోటి కేన్సర్ వస్తుందన్నారు. మహిళలో మెమోగ్రామ్ చేయించడం ద్వారా వ్యాధిని గుర్తించవచ్చన్నారు. ఈసందర్భంగా వాకర్స్ సందేహాలను నివృత్తి చేశారు.. అనంతరం ఆయనను దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షులు రాపేటి నారాయణరావు, వై.శివ, కెవివి సత్యనారాయణ, భీశెట్టి రామకృష్ణ, డాక్టర్ ఎస్.సూకరాజు, ఆడారి మల్లికార్జునరావు, నల్లల దేవుళ్ళు, బివివి. రమణ, బొగ్గారపు సర్వారావు, ఎంటి రామారావు, అరుణాచలం, విశేయం నాయుడు, విల్లూరి రామకృష్ణ, విల్లూరి సత్యనారాయణ, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రావికమతంలో వరుస చోరీలతో భయాందోళన

ప్రజాశక్తి -రావికమతం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో ఉన్న పలు వ్యాపార దుకాణాలు గత వారం రోజులుగా చోరీలకు గురవుతున్నాయి. ఎంజి వైన్స్ సమీపంలో ఉన్న కండడవీటి సర్వాజీ పాన్ షాప్ లో నగదు, విలువైన సామాగ్రి, దానికి సమీపంలో గల మెకానిక్ షెడ్‌లో చాలా విలువైన సామాగ్రిని దొంగలు ఇటీవల అపహరించారు. అలాగే ముచ్చకర్ల సూరిబాబు (యాకోబు) ఇంట్లో కుట్టు మిషను తదితర వస్తువులను దొంగలించారు. అదేవిధంగా స్క్రాప్ సామాన్ల షాపులో అతి విలువైన వైర్లు, మిషన్లు, గుణపాలు, తదితర సామాగ్రి చోరీకి గురైంది. పలువురు వ్యక్తులు ఆటోలు, టాటా మ్యాజిక్, బైకులు, సుమారు 12 వాహనాలు ఈ వారం రోజుల్లో చోరీకి గురయ్యాయి. దీంతో మండల కేంద్రంలో పలు షాపుల యజమానులు, గ్రామస్తులు భయబ్రాంతులకు గురి అవుతున్నారు.రోజు రోజుకు ఇలా దొంగతనాలు పెరిగిపోతూ ఉంటే షాపులతో పాటు ఇళ్లలో కూడా చోరీ జరిగే అవకాశాలు ఉన్నట్లు మండల కేంద్రంలో పలువురు వ్యక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఉన్న చోటనే ఇటువంటి పరిస్థితులు నెలకొంటే శివారు గ్రామాలలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుంది. ఇదంతా రాత్రి 12 గంటలకు తరువాతనే ఈ చోరీలు జరుగుతున్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపైన పోలీసులు ప్రత్యేకమైన గస్తీ నిర్వహించకపోతే మరిన్ని చోరీలు జరిగే పరిస్థితి ఉంటుందని పలువురు మండల కేంద్రంలో ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఈ విషయమై రావికమతం ఎస్ఐ రఘువర్మను వివరణ

చోరి జరిగిన షాపు

కోరగా... చోరీలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇప్పటికే ఒకరిద్దరిని గుర్తించామన్నారు. ఇంకను మిగిలిన వారిని గుర్తించే పనిలో ఉన్నామని తెలిపారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి, కమిటీ సభ్యులు

ఉత్సాహంగా గుర్రపు పందేల పోటీలు

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలోని ఒమ్మలి కాటా జంక్షన్ వద్ద ఆదివారం మోదమాంబ అమ్మవారి పాదాల తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి పసుపు కుంకమలతో ప్రత్యేక పూజలు చెల్లించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహించారు. ఎంపీపీ తాళపురెడ్డి రాజారామ్, ఆలయకమిటీ పెద్దలు ప్రారంభించారు. పోటీలలో సుమారుగా 12 గుర్రాలకు పైగా పాల్గొన్నాయి. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆశక్తిగా తిలకించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - రావికమతం: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విశాఖ బిగ్ టీవీ బ్యూరో రాజు, రిపోర్టర్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి 95 మంది రోగులు హాజరయ్యారు. జీవని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు రోగులకు కంటి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఎండి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి -మాడుగుల: తాగునీటి కోసం రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తోందనిగిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. విలేకర్లకు తమ గోడును వెల్లదీశారు. మండలంలోని అవురువాడ పంచాయతీ కొండ శిఖర పశువుల బంద గ్రామంలో పివిటీజి గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. తాగునీరు కోసం వెళ్లాలంటే నిటారు కొండ ఎక్కుతూ గంటలసేపు కాలినడకన వెళుతున్నారు. నీళ్ల కోసం రోజంతా కష్టపడి వెళితే గానీ నీరు ఉండదని తెలిపారు. జల్ జీవన్ మిషన్ అంటే ఈ గ్రామానికి కానరాలేదు. తమ గ్రామాన్ని అధికారులు ఎవరూ సందర్శించే పరిస్థితులు లేవని గిరిజనులు వాపోయారు. అనారోగ్యంకు గురయితే ఎనిమిది కిలోమీటర్లు మేర డోలీ మోసుకొని కింతలి ఆసుపత్రికి వెళుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఈ గ్రామానికి మంచి సౌకర్యం కల్పించాలని. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే

నీటిని మోసుకెళుతున్న గిరిజన మహిళలు

గోవిందరావు. పిఈటిజి ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సేదరి కామేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆలయాలకు వితరణలు

ప్రజాశక్తి -రోలుగుంట: మండలంలోని కొంతలం పంచాయతీ పాపంపేట గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముత్యా లమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టారు. బుచ్చంపేట పంచా యతీకి చెందిన అనిమిరెడ్డి రమణ (వార్డు కార్యదర్శి) సొంత నిధులతో ఆలయానికి వాల్ ఫ్యాన్ విరాళంగా అందజ

ఫ్యాన్ ఇస్తున్న దాతలు

ేశారు. ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో మోదమాంబ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన కీర్తిశేషులు పాతాళం వెంకటరమణ జ్ఞాపకార్థం భార్య వరహాలమ్మ కుమారులు కొండాజీ, దుర్గ లావణ్యాలు పావు కిలో వెండిని ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావుకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, ముమ్మిన రవణ బాబు,గెంజి రాజేష్ కుమార్, రాయపురెడ్డి కొండలరావు, అప్పాన నాయుడు, మజ్జి మహేష్, సేనాపతి గణేష్, పోతిన జగదీష్ పాల్గొన్నారు.

మాడుగుల సంతలో భారీగా ఆశీలు వసూలు

- లబోదిబోమంటున్న వ్యాపారులు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- మాడుగుల: మాడుగుల కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే వారపు సంతలో భారీగా ఆశీలు వసూలు చేస్తున్నారు. దీంతో, వ్యాపారులు, గిరిజనులు తీవ్రంగా నష్ట పోతున్నారు. పాడేరు ఏజెన్సీ గిరిజన ప్రాంతాలైన సలుగు, దేవాపురం, కందులపాలెం, ఈదులపాలెం, పులిసిమామిడి, చింతగరువు, తరగం దప్పాడ, అంటులోవ వంటి పలు గిరిజన గ్రామాలతో పాటు మాడుగుల మండలంలో కృష్ణంపాలెం, శంకరం చీడికాడ మండలంలో కోణం తదితర గ్రామాల నుండి అక్కడ పండించే అటవీ ఉత్పత్తులను విక్రయించేందుకు మాడుగుల వారపు సంతకు తీసుకొస్తుంటారు.

మాడుగుల పంచాయతీ పరిధిలో ఆశీళ్లు పాట పాడుకున్న పాట నిర్వహణదారులు వ్యాపారులు, అమ్మకందారుల నుండి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల నుండి తీసుకువచ్చిన నెత్తి బరువుకి 20 రూపాయలు, కావిడి బరువుకి 60 రూపాయలు, ఆటో లోడ్‌కి రూ.150, వ్యాన్ రూ. 400 వసూలు చేయాలనే నిబంధనలు ఉంది.

ఇందుకు వ్యతిరేకంగా నెత్తి బరువుకి రూ.30నుండి 40, కావిడి బరువుకి రూ.100 నుండి 150, ఆటోకి రూ.300 నుండి 400 వరకు, వ్యాన్ కి రూ.800 వసూలు చేస్తున్నారు.

మాడుగుల సంతలో వ్యాపారులు

సంత జరిగే ప్రదేశాలలో ఆసీళ్ల వేలంపాటకు సంబంధించి తట్ట, కావిడి బరువు, ఆటో, వ్యాన్ బరువులకి ఎంత వసూలు చేయాలన్న పట్టికను సంత ప్రదేశంలో ఏర్పాటు చేయవలసి ఉంది. కాన్నీ ఇది ఎక్కడా కానరాలేదు. వేలంపాటదారులు భారీ ఎత్తున వ్యాపారుల నుండి ఇష్టానుసారంగా ఆసీళ్లు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడం విశేషం. భారీ ఎత్తున సంత ఆసీలను కడుతున్నప్పటికీ సంతలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితి ఉందని వ్యాపారులు,గిరిజనలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధిక మొత్తంలో వసూలు చేస్తున్న ఆసీళ్లను నియంత్రించడమే కాకుండా సంతలో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

దీనిపై పంచాయితీ కార్యదర్శిని వివరణ కోరేందుకు విలేకర్లు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

కార్మికులకు సూచనలు ఇస్తున్న అధికారులు

ముమ్మరంగా శానిటేషన్ పనులు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపమాక వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా ఎంపీడీవో డి సీతారామరాజు, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు, ఇన్చార్జ్ ఈ ఓ పి ఆర్ డి శ్రీను, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఎంపీడీవో పలువురు పంచాయతీ కార్యదర్శులను శానిటేషన్ పనులు పర్యవేక్షించేందుకుగాను నియమించారు. పలు పంచాయతీల నుండి గ్రీన్ అంబాసిడర్‌లు, పారిశుధ్య కార్మికులతో శానిటేషన్ పనులు చేపట్టారు.నక్కపల్లి నుంచి ఉపమాక వరకు రోడ్డు మార్గాన, ఆలయ పరిసర ప్రాంతాలు, ఉపమాక గ్రామంలోనూ చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. ఉత్సవాలు ముగిసే వరకు శానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీవో వెల్లడించారు. శానిటేషన్ పనులను ఆదివారం డిఎల్‌పిఓ మూర్తి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు పాల్గొన్నారు.

రెల్లి కార్పొరేషన్‌ను ప్రకటించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈ నెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభలో జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రెల్లిలకు ఒక ఎమ్మెల్సీ స్థానంతో పాటు రెల్లి కార్పొరేషన్ ప్రకటన చేయాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమతి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు. ఈ మేరకు ఆదివారం వడ్డాదిలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాపారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ కాకినాడ బహిరంగ సభలో అణిచివేతకు గురవుతున్న రెల్లిలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పవన్ కళ్యాణ్ రెల్లి కార్పొరేషన్ , ఎమ్మెల్సీ స్థానం కల్పించి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నారాయణరావు, ఎంపిటిపి అప్పలరాజు, రెల్లి యూత్ నాయకులు నాగార్జున పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థులు

క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో ఉషు బాక్సింగ్, తైక్వాండో కిక్ బాక్సింగ్ గేమ్స్‌లలో నియోజకవర్గ స్థాయి సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట ప్రసాద్, మునికోటి విజయ్, బి.రాజేశ్వరి, ఎస్.అర్జున్‌రెడ్డి, ప్రియాంక, మౌనికలు హాజరయ్యారు. ఈ సెమినర్‌లో భాగంగా క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కోచ్, రిఫరీ జడ్జి సెమినార్ జిల్లా స్థాయిలో కూడా జరుగుతాయని, దీనికి జిల్లా స్థాయి మండల స్థాయి నుండి జూనియర్, సీనియర్ కోచ్‌లు పాల్గొంటారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. వీటికి శాప్ కోచ్ అబ్బు సెమినార్ గేమ్స్ రూల్స్‌ను వివరించారు. అకాడమికి చెందిన వెలగా నారాయణరావు స్పోర్ట్స్ టీషర్ట్స్‌లు, భోజన వసతి కల్పించారు. అనంతరం సెలక్షన్స్ నిర్వహించి సర్టిఫికేట్లు అందజేశారు.

చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ:విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గొలుగొండ శాఖా గ్రంథాలయాధికారి రాజుబాబు కోరారు. ఆదివారం శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పుస్తకాలు, నీతి కథలు చదివించారు. అనంతరం నీతికథలోని సారాంశాలను వివరించారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని చెప్పారు.

కిట్లను అందజేస్తున్న కంచర్ల

టెన్త్ విద్యార్థులకు పరీక్షల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంచర్ల వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు ఆదివారం ఉదయం పెదవాల్తేరు వద్ద కేడీపీఎం హైస్కూల్‌లో 150 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకార్ ట్రస్ట్ సభ్యులు, కేడబ్ల్యుజేడబ్ల్యుఏ సభ్యులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఐటిడిఎ పరిధిలో జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని టిడబ్ల్యూ డిడి ఎల్.రజని అన్నారు. పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై ప్రజాశక్తితో మాట్లాడుతూ, పరీక్షల ఏర్పాట్లు వివరాలను వివరించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని, ఉపాధ్యాయులతో తరచూ సమీక్షలు, ఎప్పటికప్పుడు పది పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

పోరాటాలతో..

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటాం

- 1441వ రోజుకు జెఏసి దీక్షలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలనే కుట్రలో భాగంగా కాంట్రాక్ట్ కార్మికులను, పర్మినెంట్ ఉద్యోగులను తప్పుడు కారణాలతో పెద్ద ఎత్తున తొలగించే చర్యలకు యాజమాన్యం పూనుకుంటుందని పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ నాయకులు జి.టి.పి ప్రకాష్, ఎస్.రమణ తెలిపారు. స్టీల్ ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజా సంఘాల జెఏసి చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 1441వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో బిహెచ్ఈఎల్, షిప్ యార్డ్, విశాఖ డైయిరీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దాదాపు నాలుగు సంవత్సరాలుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగుతుందని తెలిపారు. ఈ పోరాటం ఫలితంగా ఇంతవరకు కేంద్రం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయటానికి సాహసించ లేకపోయిందన్నారు. పోరాటం ఫలితంగా స్టీల్ ప్లాంట్ కు రూ.11440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ కేంద్రం ప్రకటించిందన్నారు. స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు ఇవ్వాలని, లేదంటే సెయిల్ లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో

ప్రసాద్,కె.నారపురెడ్డి, అప్పలనారాయణ,వి. విజయ, భవాని,ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

మే 11, 12, 13 తేదీల్లో ..

పాడేరు మోదకొండమ్మ రాష్ట్ర జాతర

ప్రజాశక్తి -పాడేరు: గిరిజనుల ఇలవేల్పు, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ తల్లి రాష్ట్రస్థాయి జాతరను మే 11, 12, 13 తేదీల్లో నిర్వహించేందుకు పుర ప్రముఖులు గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయించినట్లు ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వెల్లడించారు. ఉత్సవ తేదీలను ఖరారు చేసేందుకు ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిళ్ళ కోటి బాబు నాయుడు అధ్యక్షతన గ్రామ పెద్దలు, పలు సంఘాల నాయకులు, వర్తక సంఘం నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ ఏడాది ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. గతంలో కన్నా భిన్నంగా గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా భారీ స్థాయిలో ఏడాది మోదకొండమ్మ తల్లి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉత్సవాలకు మోదకొండమ్మ తల్లి భక్తులు, అన్ని వర్గాల ప్రజలు విరివిగా విరాళాలు ఇచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. త్వరలో పూర్తిస్థాయి ఉత్సవ కమిటీని వెల్లడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి కె. సింహాచలం నాయుడు, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, వైయస్సార్సీపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ, వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిదరి మంగళన్నదొర, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు రాంబాబు, వైయస్సార్ సిపి జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్ పాల్గొన్నారు.

11న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:విశాఖపట్నం జిల్లాలో ఈనెలన 11న నైపుణ్య అభివృద్ధి అండ్ శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లానైపుణ్యాభివృద్ధి అధికారి టీ.చాముండేశ్వరరావు తెలిపారు. జిల్లాలో కంచరపాలెం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో డబ్ల్యూ.ఎన్.ఎస్, డిజిటల్ వుమ్ సర్వీసెస్, యోకోహమా టైర్స్, అపోలో ఫార్మసీ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు.పదవ తరగతి, ఇంటర్ డిగ్రీ, ఎం ఫార్మసీ, బి ఫార్మసీ, డి ఫార్మసీ ఏదైనా డిప్లమో చదివిన నిరుద్యోగ యువతీ యువకులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఆశక్తి గల అభ్యర్థులు నైపుణ్యం.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకొని జాబ్ మేళాకు అప్లై చేసి అడ్మిట్ కార్డుతో హాజరు అవ్వాలని తెలియజేసారు. అదే రోజున స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉందని, ఆధార్ నెంబరు, లింక్డ్ మొబైల్ నెంబర్ తో హాజరుకావాలని తెలియజేసారు. మరిన్ని వివరాలకు 9948768778 ఫోన్: నంబర్ ని సంప్రదించాలని తెలియజేశారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం

తీరువీధిలో పెండ్లి కావిడి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలకు ఆలయ అర్చక బృందం ఆదివారం ఉదయం శ్రీకారం చుట్టారు. పురవీధుల్లో పెండ్లి కావడి ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సాయంత్ర అలయంలో వార్షిక కల్యాణ మహెూత్సవం ప్రారంభ సూచికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు వెంకన్న కల్యాణం

ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద సోమవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి ఎదురునన్నాహ మహెూత్సవం, రథోత్సవం జరుగుతుంది. అనంతరం అర్ధరాత్రి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కల్యాణ వేదిక వద్ద అంగరంగ వైభవంగా ఉభయ దేవరులతో స్వామి కల్యాణోత్సవం జరుగుతుంది. భక్తులు కల్యాణం తిలకించేందుకు తితిదే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. సోమవారం తెల్లవారు జామునుండి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు రానున్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

వెంకన్న కల్యాణోత్సవాలు సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు. బందోబస్తుకు నియమించిన పోలీసులు ఆదివారం సాయంత్రం ఉపమాక చేరుకున్నారు. 300 మంది పోలీసు బందోబస్తు నియమించారు. నర్సీపట్నం డి ఎస్ పి పి శ్రీనివాసరావు, 10 మంది సిఐలు, 20 మంది ఎస్ఐ లు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తుకు హాజరైన పోలీసులకు పలు సూచనలు చేసారు. రూట్ మ్యాప్ వారీగా గుర్తించిన ప్రాంతాల్లో పోలీసులను కేటాయించారు. స్వామి తిరువీధి సేవలు, రథోత్సవాల్లో ఎటువంటి తోపులాటలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపమాకలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా గ్రామానికి వచ్చే నలువైపులా వున్న మార్గాల నుండి 10 వ తేది ఉదయం నుంచి 11వ తేది ఉదయం వరకు వాహనాలను పార్కింగ్ ప్రాంతంలోనే నిలివేయాలని పోలీసులకు సూచించారు. పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్థానిక సిఐ కుమారస్వామి అన్నారు. 16 సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటుందని స్థానిక సీఐ కుమారస్వామి వెల్లడించారు.

భక్తుల అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

హోం మంత్రి అనిత

నక్కపల్లి: ఉపమాక వెంకన్న తిరువార్షిక కళ్యాణ ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. స్వామివారి ఉత్సవాల సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం హెూంమంత్రి పరిశీలించారు. భక్తుల క్యూ లైన్లు, కేశఖండనశాల, పుష్కరిణిలో స్నాన ఘట్టాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెంకటేష్, వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ లు కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, పెంకుల రాజు, గోవిందరావు, సర్పంచ్ ప్రగడ వీరబాబు, నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి శ్రీను, తోలేటి శ్రీనివాస్, వాసు పాల్గొన్నారు.

ఉత్సవాలకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో సోమవారం నుండి శనివారం వరకు జరిగే వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రధాన కూడళ్ళ, దేవాలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.స్వామి దర్శనాలు, సాంస్కతిక ప్రదర్శనల సమయంలో ఎవరైనా అల్లరి మూకలు అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పాంప్లెట్‌లను ఆవిష్కరించారు.

ధర్మశ్రీ సహకారంతో మెట్లకు గోవింద నామాలు

ప్రజాశక్తి -వడ్డాది:వడ్డాది వెంకన్న ఆలయ మెట్ల మార్గంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ,విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో గోవింద నామాలు ఏర్పాటు చేశారు. ధర్మశ్రీ దంపతులు రూ.లక్ష తమ సొంత నిధులు ఆలయ అభివృద్ధికి విరాళంగా ఇచ్చారు. ఈ నిధులతో వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు గిరిజాంబగిరి మెట్ల మార్గంలో గోవింద నామాలు ఏర్పాటు చేశారు. మెట్లను రంగులతో తీర్చిదిద్దారు.

మెట్ల మార్గం వద్ద కన్నబాబు